

గర్భంలోనే శిశువు మృతి

స్థానిక జిల్లాస్పత్రిలో వైద్యుల నిర్వాకం ఓ తల్లికి గర్భశోకాన్ని మిగిల్చింది. పండంటి బిడ్డకు జన్మనిస్తానని మురిసినపోయిన ఆమె చేతిలో మృత శిశువును పెట్టడంతో కన్నీరు మున్నీరైంది. 8లో



టమాట కిలో రూ.77

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.77, కనిష్టంగా రూ.51, సరాసరిన రూ.67 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/22.6°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కేజీబీవీలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్



పుట్టపర్తి: కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉద్యోగాలను తాత్కాలిక ప్రాతిపాదికన భర్తీ చేసేందుకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసిందని డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీల వివరాలిలా..

ప్రిన్సిపాల్–1, సీఆర్‌టీ–18, పీజీటీ–30, అకౌంటెంట్–04, వార్డెన్–05, పార్ట్ టైం టీచర్లు–12 మొత్తం 70 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 10వ తేదీ లోపు తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు http:// apkgbv. apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

30లోపు వందరోజుల కార్యాచరణ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: స్వర్ణాంధ్ర –2047 విజన్‌కు సంబంధించిన జిల్లా, మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనను అధికారులు ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో అధికారులతో స్వర్ణాంధ్ర–2047, వంద రోజుల ప్రణాళికలపై వివిధ అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలను మండల ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. రానున్న ఐదేళ్ల కాలానికి విజన్ ప్లాన్లు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య, విద్య, నైపుణ్య అభివృద్ధి అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మడకశిర నియోజకవర్గ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలపై వివిధ శాఖలు సిద్ధం చేసి నివేదికలను త్వరితగతిన అందజేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సీపీఓ విజయ్‌కుమార్, డీఏఓ సుబ్బారావు, ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, వసతి గృహ సంక్షేమ అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రావు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ , ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, డీఎంహెచ్ఓ మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం

- ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ నాగలింగారెడ్డి



అధ్యాపకులతో చర్చిస్తున్న ఆర్జేడీ నాగలింగారెడ్డి

రాయదుర్గం: విద్యతోనే పేదరికం దూరమవుతుందని విద్యార్థులకు ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ నాగలింగారెడ్డి సూచించారు. రాయదుర్గం మండలం ఉడేగోళం సమీపంలో ఉన్న కేటీఎస్ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ... సమస్యలపై ఆరా తీశారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూసుకోవాలన్నారు. బోధన, అభ్యసన, డిజిటల్ ఏ బీ సీ, జాబ్ పోర్టల్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్, తదితర అంశాలపై చర్చించారు. ఉన్నత విద్యాశాఖ కమిషన్ అమలులోకి తెచ్చిన సీఐఏ పద్ధతిపై అవగాహన కల్పించారు. అంతర్గత పరీక్షల మార్కుల నమోదు అంశంలో విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు.



హిందూపురం: శ్రీశైలపుత్రి అలంకరణలో మహాలక్ష్మి



లేపాక్షి: బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి

నవరాత్రి శోభ

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా లోని పలు ఆలయాల్లో తొలిరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచే ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కదిరిలో వెలసిన నరసింహస్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



కదిరి: మత్స్యావతారంలో ఖాద్రీ నృసింహుడు



బత్తలపల్లి: బాలా త్రిపురసుందరిగా దర్శనమిస్తున్న లలితాదేవి



రొళ్ల: రత్నగిరిలో అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

ఇసుక బ్లాక్

జిల్లా వ్యాప్తంగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. అడిగే వాళ్లు లేరు. అడ్డుకునే వారు లేరు. పర్యవేక్షించేవారు అసలే లేకపోవడంతో కొందరు టీడీపీ నేతలు రాత్రింబవళ్లు నదులు, వాగులు, వంకలను జేసీబీలతో తోడేస్తూ.. పొరుగు రాష్ట్రం కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

- రీచ్‌ల వద్ద నో స్టాక్.. ఎక్కువ డబ్బులిస్తే వెంటనే సరఫరా
- అనధికారికంగా నదులను ఇష్టానుసారం తవ్వేస్తున్న తమ్ముళ్లు
- టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా
- కర్ణాటకకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్న వైనం
- ఇసుక దొరకడమే లేదంటున్న ప్రజలు



ట్రాక్టరులో తరలిపోతోన్న ఇసుక

సాక్షి, పుట్టపర్తి: ప్రభుత్వ ధర ప్రకారం ఇసుక కొందామంటే బుకింగ్ క్లోజ్ అని స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న వారు చెబుతున్నారు. అయితే అడిగినంత ఇచ్చేవాళ్లకు మాత్రం గంటల వ్యవధిలో పక్కనే ఉన్న నదులు తవ్వేసి ఏ ప్రాంతానికి అయినా సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని చిత్రావతి, పెన్నేరు, కుముద్వతి, జయమంగళి నదులను రాత్రిపూట జేసీబీలతో తోడేస్తున్నారు. పోలీసులకు ముడుపులు చెల్లించి అడ్డుకోకుండా జాగ్రత్త పడుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఇసుక దందా జరుగుతున్నట్లు చెబుతున్నారు. జిల్లా పరిధిలో రామగిరి, కుటాగుళ్ల, ఉప్పలపాడు, నల్లబోయినపల్లి, కొడవండ్లపల్లిలో గతంలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఆయా పాయింట్ల వద్ద సరిపడా ఇసుక లేదు.

స్టాక్ పాయింట్ల మూత కానీ..

రామగిరిలోని స్టాక్ పాయింట్ మూసివేశారు. కానీ బ్లాక్‌లో పెన్నానది నుంచి ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. నల్లబోయినపల్లి వద్ద ఉన్న స్టాక్ పాయింట్ కూడా బంద్‌లోనే ఉంది. ప్రస్తుతం ఇసుక లేదు. కానీ ఆ ప్రాంతానికి ఇసుక సరఫరా అవుతోంది. కుటాగుళ్లలోని ఇసుక స్టాక్ పాయింట్ మూసివేశారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి సరఫరా చేస్తున్నారు. అలాగే ఉప్పాలపాడు పాయింట్ వద్ద జూలై 10న 11,580 టన్నుల నిల్వ ఉండేది. ప్రస్తుతం 666 టన్నులు ఉంది. బుకింగ్ చేసుకున్న 24 గంటల తర్వాత ఇసుక ఇంటికి చేరుతోంది. కొడవండ్లపల్లి పాయింట్‌లో జూలై 10 నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 56 వేల టన్నుల ఇసుక విక్రయించారు. ప్రస్తుతం నిల్వ చేస్తున్నారు. ఎలాంటి లావాదేవీలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పీసీ రేవు రీచ్‌లో 29 వేల టన్నుల ఇసుక ఉంది. బుక్ చేసుకున్న 24 గంటల వ్యవధిలో సరఫరా చేస్తున్నారు.

రీచ్‌లు లేకున్నా అడిగిన వెంటనే..

హిందూపురం నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు లేవు. అయితే చిత్రావతి, పెన్నా, కుముద్వతి, జయమంగళి నదుల నుంచి కొందరు టీడీపీ నేతలు అడ్డదిడ్డంగా ఇసుక తవ్వేస్తున్నారు. తూమకుంట, సంతేబిదనూరు, కిరికెర, చౌళూరు, మలుగూరు, బేవనహళ్లి వద్ద ట్రాక్టర్ ఇసుక కావాలంటే రూ.3 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. డబ్బులు చెల్లిస్తే గంటల వ్యవధిలో ఇసుక ఇంటికి చేరుతోంది. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇసుక విక్రయాలు అక్రమంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రీచ్‌లు లేవు. అయితే టీడీపీ నేతలు ఎమ్మెల్యే అండదండలతో చిత్రావతినదిలో జేసీబీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానం కాగితాలకే పరిమితమైందని ప్రజలు వాపోతున్నారు.

ధర్మవరంలో పోటాపోటీగా..

ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు ఉన్నా సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ఇసుక అక్రమ రవాణాలో కూటమి నేతల మధ్య పోటీ నెలకొంది. టీడీపీ – బీజేపీ – జనసేన నాయకులు రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. రీచ్‌లతో సంబంధం లేకుండా.. బుకింగ్ లేకున్నా.. ఫోన్ కొడితే చాలు.. రేటు చెప్పి మరీ ఇంటికి పంపిస్తున్నారు. మడకశిర, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల్లోనూ ఇసుక రీచ్‌లు లేవు. అయితే ఇసుక కొరత ఎక్కడా కనిపించడం లేదు. సమీపంలోని నదుల్లో టీడీపీ నాయకులు అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఫలితంగా డబ్బులు చెల్లిస్తే.. గంటల్లోనే ఇసుక ఇంటికి చేరుతోంది.

పేరుకు మాత్రమే ఉచితం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎక్కడా ఉచితంగా ఇసుక అందుబాటులో లేదు. ప్రతి చోట టీడీపీ నేతల కనుసన్నల్లో అక్రమ దందా జరుగుతోంది. టిప్పర్ ఇసుక కొనాలంటే రూ.18 వేలు పైగా చెల్లించాల్సి వస్తోంది. ఆ లెక్కన ఒక టన్ను ఇసుక రూ.వెయ్యి కంటే తక్కువగా జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా దొరకడం లేదు.

– నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు, కదిరి

కూలిన ప్రహరీ - చిన్నారి మృతి



పార్థసారథిరెడ్డి (ఫైల్)

తాడిమర్రి: ఇంటి ప్రహరీ కూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ చిన్నారి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.... తాడిమర్రి మండలం మోదుగులకుంట గ్రామానికి చెందిన మాజీ డీలర్ మారక శివానందరెడ్డి, రజినీ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు పార్థసారథిరెడ్డి (3) గురువారం సాయంత్రం 5 గంటలకు ఇంటి వద్ద ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్టు కింద ఆడుకుంటూ ఉన్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు బలహీనపడిన ప్రహరీ ఉన్నఫలంగా బాలుడిపై కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు ఆగమేఘాలపై శిథిలాలు తొలగించి, తీవ్రంగా గాయపడిన చిన్నారిని స్థానిక ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుడి సూచన మేరకు బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమార్తెల తర్వాత కుమారుడు జన్మించడంతో ఎంతో అల్లారుముద్దుగా చూసుకునేవారమంటూ తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు అక్కడున్నవారిని కంటితడి పెట్టించింది. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్‌లో శివానందరెడ్డిని పరామర్శించి ఓదార్చారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు



మరువ పారుతున్న సాహెబ్‌చెరువు



వెంకటగారిపల్లి చెక్‌డ్యాం

- 30 మండలాల్లో కురిసిన వాన

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా మరోసారి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ జిల్లాలోని 30 మండలాల్లో 872.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని సీకేపల్లిలో అత్యధికంగా 82.4 మి.మీ, పుట్టపర్తిలో 72.4, లేపాక్షిలో 60.2 , రొద్దంలో 59.6 , హిందూపురంలో 54.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే కొత్తచెరువులో 47, చిలమత్తూరులో 46.8, పరిగిలో 40.6, సోమందేపల్లిలో 40.4, నల్లమాడలో 38.6, బుక్కపట్నంలో 34.2, మడకశిరలో 34, గోరంట్లలో 31.2, తలుపులలో 30.4 మి.మీ వాన పడింది. అగళిలో 23.4, కనగానపల్లిలో 22.4, తనకల్లులో 18.4, ఎన్‌పీ కుంటలో 17.2, ముదిగుబ్బలో 15.4, ఓడీ చెరువులో 15.4, పెనుకొండలో 13.2, ధర్మవరంలో 12.4, రొళ్లలో 12.2, నల్లచెరువులో 11.8, తాడిమర్రిలో 9, రామగిరిలో 8.4, కదిరిలో 6.6, గుడిబండలో 6, అమడగూరులో 5.2, గాండ్లపెంటలో 3.6 మి.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 30 మండలాల్లో మొత్తం 872.8 మి.మీటర్ల వర్షం కురవగా సగటున 27.3 మి.మీగా నమోదైంది. ఈ వర్షాలకు అక్కడక్కడ కుంటల్లో నీళ్లు నిలిచాయి. పుట్టపర్తి మండలంలోని వీరాంజనేయపల్లి వద్ద ఉన్న సాహెబ్‌చెరువు, వెంకటగారిపల్లి వద్ద ఉన్న చెక్‌డ్యాం మరువ పారాయి. వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటలు వాడుముఖం నుంచి తేరుకొని ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాలి, వాన బీభత్సం..

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లిలో గాలి,వానతో పాటు వడగండ్లు వాన దంచికొట్టింది. దాదాపు అరగంట గాలి, వాన కురవడంతో చెన్నేకొత్తపల్లిలో నష్టం జరిగింది. 44వ నంబరు జాతీయ రహదారి పక్కన అంజినేయులు, రాధాకృష్ణలకు చెందిన రేకులతో దుకాణాలను గాలికి లేచిపోయాయి. ఆంజనేయులు అనే వ్యక్తి దుకాణంలో పది బస్తాల సిమెంటుతో పాటు అంగడి సరుకులు, ఇతర వస్తువులు తడిసి రూ.80 వేల నష్టం జరిగింది. దాదాపు పది కరెంటు స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయని విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. పలువురు రైతులకు చెందిన పంటలకు నష్టం జరిగింది.



చెన్నేకొత్తపల్లిలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



రొద్దం సమీపంలో నిండిన వాగు

అలరించిన 'ప్రేమ వాహిని'



ప్రేమ వాహిని నృత్యరూపకంలోని ఓ ఘట్టం



సంగీత విభావరిలో పాల్గొన్న మహబూబ్‌నగర్ భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి తన అవతార వైభవం ద్వారా భక్త కోటికి చూపిన లీలలను వివరిస్తూ నిర్వహించిన 'ప్రేమ వాహిని' నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మహబూబ్‌నగర్ జిల్లా సత్యసాయి భక్తులు గురువారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సంగీత కచేరీ నిర్వహించారు. తర్వాత స్వయం ఉపాధి కోసం పలువురు భక్తులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సాయంత్రం ప్రేమ వాహిని పేరుతో నిర్వహించిన నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది.

నవరాత్రి పూజలు ప్రారంభం..

ప్రశాంతి నిలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దేవీ నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అర్‌జె. రత్నాకర్‌రాజు పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా జరుపుకోండి



ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్పీ రత్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ఎక్కడా సమస్య తలెత్తకుండా పోలీసు సిబ్బంది అన్ని జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు డీజేలు, డ్యాన్సులు, ఊరేగింపులపై నిషేధం విధించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 యాక్ట్ అమల్లో ఉందని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ డీసీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య,, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ గోవిందనాయక్, సీఐ నాగరాజు, ఎస్ఐ మనోహర్‌రాజు పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను గురువారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతన మద్యం పాలసీ విధానం, మద్యం షాపుల దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ, అక్రమ మద్యం రవాణాను అరికట్టడంపై వారు చర్చించారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ



కూలిపోయిన గోడ

లేపాక్షి: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 60.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి స్థానిక కేజీబీవీ ప్రహరీ కుప్పకూలింది. ప్రహరీ కూలిపోవడంతో బాలికలకు ఎదురయ్యే ఇబ్బందులపై విద్యాలయ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సమగ్ర శిక్ష కార్యాలయానికి విన్నవించినట్లు స్పెషల్ ఆఫీసర్ నీలిమా తెలిపారు.

బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేకూర్చాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన, ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు త్వరగా అందేలా చూడాలని డీపీఓ సిబ్బందిని ఎస్పీ రత్న ఆదేశించారు. పోలీస్ వెల్‌ఫేర్ పండ్, సంక్షేమం, బాధిత కుటుంబాలకు అందాల్సిన బకాయిలపై గురువారం డీపీఓలో అసోసియేషన్ ప్రతినిధులతో కలసి ఆమె సమీక్షించారు. సిబ్బంది అందరూ టీం వర్క్‌గా పని చేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, మల్లికార్జున, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బకు అడవి పందులు పరార్!

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు వినూత్న మార్గాలను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద వేరుశనగ పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ చీరలతో ఓ రైతు కంచె ఏర్పాటు చేశాడు. మరో రైతు డబ్బా రేకులు, సీసాలు, ప్లేట్లు వేలాడదీశాడు. గాలి వీచిన ప్రతిసారీ ప్లేటు అటు ఇటూ ఊగుతూ డబ్బా రేకులు, గాజు సీసాలకు తగలడం ద్వారా ఉత్పన్నమైన శబ్దానికి పందులు పొలం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల మరి కొందరు రైతులు తమ పొలాల్లో గాజు సీసాలు, ప్లేట్లు వేలాడదీసి అడవి పందులను బెంబేలెత్తించి పంటను కాపాడుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మామిళ్లపల్లి సమీపంలో వేరుశనగ పంట పొలం చుట్టూ కట్టిన చీరలు



గాలికి ఊగుతూ శబ్దం చేస్తున్న ప్లేటు, గాజు సీసా



వేలాడదీసిన డబ్బా రేకులు

ఎంపీపీ చంద్రశేఖర్‌కు పలువురి నివాళి



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ



ఎంపీపీ చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీచరణ్

రొద్దం: అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన రొద్దం ఎంపీపీ పైగేరి చంద్రశేఖర్ మృతదేహాన్ని గురువారం ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ మంత్రి ఎం.శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీచరణ్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి రొద్దం మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చంద్రశేఖర్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మాజీ మంత్రి శంకరనారాయణ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మాలగుండ్ల రవి, పలువురు కౌన్సిలర్లు, రొద్దం మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా, చంద్రశేఖర్ మృతదేహానికి గురువారం పలువురు అధికారులు నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయి రథయాత్ర



నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి రూరల్: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన భక్తులు గురువారం సత్యసాయి రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ కూడలి వద్ద బాబా చిత్రపటాన్ని ఉంచిన రథానికి ఆర్‌జే రత్నాకర్‌రాజు దంపతులు పూజలు చేసి, నగర సంకీర్తనను ప్రారంభించారు.

హరిత జిల్లాగా మార్చేందుకు కృషి

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు, ఎస్పీ రత్న



సీఎన్‌జీ ఫిల్లింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు, ఎస్పీ రత్న, తదితరులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాను హరిత వనంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ఎస్పీ వి.రత్న అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన పుట్టపర్తి మండలం కప్పలబండ వద్ద ఐటీ పార్క్‌లో మొట్టమొదటి పరిశ్రమ సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్‌ను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎన్‌జీ ప్రథమ్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ చిరదీప్‌దత్తా, ప్రెసిడెంట్ అండ్ జనరల్ కౌన్సిల్ సుశీల్‌జాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.9 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసిందని, దీంతో పలువురు పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యం పెద్ద అవరోధంగా మారిన ప్రస్తుత రోజుల్లో గ్యాస్‌తో నడిచే వాహనాలు రావడం సంతోషదాయకమన్నారు. దీంతో పాటు పైప్ లైన్ ద్వారా ప్రశాంతి నిలయంలోని గృహ అవసరాలకు, హోటళ్లు, క్యాంటీన్లు, బేకరీలకు గ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భంలోనే శిశువు మృతి

- సాధారణ ప్రసవం పేరుతో ఆలస్యం
- పరిస్థితి చేజారి పోతున్నా పట్టించుకోని వైద్యులు
- వైద్యుల నిర్లక్ష్యం అంటూ బాధితుల ఆవేదన



బాలింత మైథిలి

హిందూపురం టౌన్: స్థానిక జిల్లాస్పత్రిలో వైద్యుల నిర్వాకం ఓ తల్లికి గర్భశోకాన్ని మిగిల్చింది. పండంటి బిడ్డకు జన్మనిస్తానని మురిసినపోయిన ఆమె చేతిలో మృతశిశువును పెట్టి 'ఉయ్ ఆర్ సారీ' అని చెప్పి తీరని ఆవేదనను మిగిల్చారు. వివరాలు... హిందూపురంలోని మేళాపురానికి చెందిన నిండు గర్భిణి మైథిలికి బుధవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు మొదలు కావడంతో 3 గంటల సమయంలో కుటుంబసభ్యులు హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి పిలుచుకువచ్చారు. వైద్య పరీక్షల అనంతరం నార్మల్ డెలివరీ అవుతుందని డాక్టర్లు నిర్ధారించారు. గంటలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. పురిటి నొప్పులు తాళలేక మైథిలి పడుతున్న ఆవేదనను గమనించిన తల్లి రత్నమ్మ... కనీసం సిజేరియన్ చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడాలని వేడుకుంది. ఆ సమయంలో ఆమెపై వైద్యులు, స్టాఫ్ నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ చికిత్స ఎప్పుడు చేయాలో తమకు తెలుసునని దబాయించారు. దీంతో మైథిలి పరిస్థితిని చూస్తూ కుటుంబసభ్యులు నోరు మెదపలేక మౌనంగానే తమలో తాము కుమిలిపోయారు. పరిస్థితి విషమిస్తుండడంతో గురువారం ఉదయం మైథిలిని లేబర్ వార్డుకు తీసుకెళ్లి సిజేరియన్ చేశారు. ఉదయం 7.30 గంటలకు మృత ఆడ శిశువును తీసుకొచ్చి కుటుంబసభ్యుల చేతికిచ్చి గర్భంలోనే చనిపోయిందని చెప్పి మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. అమ్మ పక్కన చేరి పొత్తిల్లో ఆడుకోవాల్సిన బిడ్డ.. ఉలుకు పలుకు లేకుండా ఉండడాన్ని చూసిన కుటుంబ సభ్యుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని, బుధవారమే సిజేరియన్ చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదంటూ బోరున విలపించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న మాట్లాడుతూ... గర్భంలోనే శిశువు మృతి చెందిన విషయం వాస్తమేనని, దీనిపై వివరాలు సేకరించామన్నారు. అయితే ఈ అంశంపై మరింత లోతైన విచారణ చేపడతామన్నారు.

మద్యం టెండర్ బాక్సుల ఏర్పాటు



టెండర్ బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం అర్బన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి టెండర్ బాక్స్‌ను హిందూపురంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ టెండర్లను ఇందులో దాఖలు చేయవచ్చు. అర్బన్ పరిధిలో 6, రూరల్‌లో 1, లేపాక్షిలో 1, చిలమత్తూరులో 1, పరిగిలో 2 చొప్పున మొత్తం 11 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. 10న దరఖాస్తుల పరిశీలన, 11న ఉదయం 8 గంటలకు పుట్టపర్తిలో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎవరైనా ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చునని,అయితే, దరఖాస్తు రుసుం కింద రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కల్తీ కల్లు అమ్మకాలు అరికట్టండి



వినతి పత్రాన్ని ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: మండలంలో కల్తీ కల్లు అమ్మకాలను అరికట్టాలని ఏపీ ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన చౌళూరు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, ఎక్సైజ్ అధికారుల అండతో కల్తీ కల్లు విక్రయాలను కల్లు కాంట్రాక్టర్ రామకృష్ణప్ప యథేచ్ఛగా సాగిస్తున్నారని ఆరోపించారు. హిందూపురం చుట్టుపక్కల ఎక్కడేగాని ఈత చెట్లు లేకపోయినా విషపూరిత రసాయన పదార్థాలు కలిపి లీటర్ రూ.40 చొప్పున రోజూ లక్ష లీటర్ల కల్లు విక్రయిస్తున్నట్లు వివరించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య అధ్యక్షుడు నారాయణ, బీఎస్పీ నాయకులు శ్రీరాములు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు అనిల్, పురుషోత్తం, లోకేష్, అశోక్, నిఖిల్, రామాంజి, తిప్పన, ఎస్‌డీపీఎఫ్ నౌషాద్, ఆర్‌సీపీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హెచ్‌ఆర్‌సీ ఉపాధ్యక్షుడిగా గురప్ప



పుట్టపర్తి: జాతీయ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన కురుబ గురప్ప నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం ఆంగ్ల ఉపన్యాసకులగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ హెచ్‌ఆర్‌సీ అధ్యక్షుడు హాజీ షేక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

9 మందిపై కేసు నమోదు

పుట్టపర్తి టౌన్: పాత కక్షలు మనుసులో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు సందీప్, గోపాల్‌పై దాడి చేసిన కేసులో 9 మంది టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పుట్టపర్తిలోని 8 వార్డు చిత్రావతి గుట్ట ప్రాంతంలో 12 సంవత్సరాలుగా సందీప్, గోపాల్ సోదరులు సెలూన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం టీడీపీ కార్యకర్తలు చాకలి సుధాకర్, ప్రశాంత్, చాకలి నరేష్, సాయి మనోజ్, ముబారక్, హరి, బబ్లు అక్కడకు చేరుకుని ఇనుప రాడ్లు, కట్టెలతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకునేలోపు టీడీపీ కార్యకర్తలు పరారయ్యారు. క్షతగాత్రులను సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సందీప్‌ను అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు తొమ్మిదిపై గురువారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సికింద్రాబాద్ - వాస్కోడిగామా మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 6,9,10వ తేదీల్లో సికింద్రాబాద్-వాస్కోడిగామా మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6న సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఉదయం 11.45 గంటలకు బయలుదేరి రైలు (07039) గుంతకల్లుకు సాయంత్రం 6.15 గంటలకు చేరుతుంది. తిరిగి 6.25 గంటలకు బయలుదేరి బళ్లారి, హోస్పేట్, కొప్పల్, గదగ్, హుబ్లీ మీదుగా వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చేరుతుంది. అదేవిధంగా మరో రైలు (07039) 9వ తేదీ బుధవారం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఉదయం 10.05 గంటలకు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు సాయంత్రం 4.50 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5.50 గంటలకు బయలుదేరి వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు చేరుతుంది. తిరిగి 10వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు వాస్కోడిగామా (07040) ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 8.55 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు చేరుతుంది.

'సుప్రీం'ను తప్పుపట్టడం సరికాదు

- సుప్రీం ధర్మాసనంపై పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలు శోచనీయం
- వైఎస్సార్‌సీపీ ధర్మవరం నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: బంధుప్రీతితోనే తిరుమల లడ్డూ వివాదంలో సీఎం చంద్రబాబుకు మద్దతుగా బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి నిలిచారని మాజీ ఎమ్మెల్యే, ధర్మవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ కచ్చితమైన సమాచారం లేకుండా తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు నిరాధార వ్యాఖ్యలు చేయడం సబబు కాదని సుప్రీం ధర్మాసనం అక్షింతలు వేస్తే.. బీజేపీ అధ్యక్షురాలు మాత్రం బంధుప్రీతితో చంద్రబాబుకు కితాబునిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గురువారం ఆయన ధర్మవరంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును వెనకేసుకు రావడం పురందేశ్వరికి కొత్తేమి కాదన్నారు. తన తండ్రి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినప్పుడు కూడా ఆమె చంద్రబాబుకే మద్దతు తెలిపారని గుర్తు చేశారు. తాజాగా కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీసేలా లడ్డూ అంశంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సమర్థించడం బాధాకరమన్నారు. వాస్తవాలు నిగ్గు తేలే వరకూ తిరుమల లడ్డుపై ఎవరూ స్పందించకుండా ఉండటం మంచిదన్నారు. దేవుడి పేరు మీద రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు.

బాబు పాలన అధ్వానం..

చంద్రబాబు వందరోజుల పాలన చాలా అధ్వానంగా ఉందని కేతిరెడ్డి విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయకూడదని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గళమిప్పిన కూటమి నాయకులు... ఇప్పుడు ఏకంగా వేల మంది కార్మికుల పొట్టకొడుతూ ప్రైవేట్ పరం చేసేందుకు ఉపక్రమించడం దారుణమన్నారు. గతంలో వైజాగ్ స్టీల్‌ను ప్రైవేట్ పరం చేయాలని కేంద్రం యత్నిస్తే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే కార్మికులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఏపీ ప్రభుత్వమే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కొని కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తుందని నాడు వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు పెట్రో ధరలు తగ్గించాలని గొంతు చించుకున్న టీడీపీ నాయకులు... ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇప్పుడు లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.10 తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ వంద రోజుల పాలనలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ జనరంజక పాలనకు, చంద్రబాబు విధ్వంస పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

నేడు జిల్లాస్థాయి సమావేశం

ప్రశాంతి నిలయం: స్వర్ణాంధ్ర -2047 జిల్లా విజన్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు తీసుకునేందుకు శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఈ నెమలి.. మన నెచ్చెలి





సింగంపల్లిలో చెట్టుపై వాలిన నెమలి, ఇంటి ప్రహరీపై కూర్చొని ఫొటోలకు ఫోజులిస్తున్న దృశ్యం

ఎప్పుడు అడవిలో తిరిగి చెట్లు... పుట్టలంటే బోర్ కొట్టింది... ఏమో ఆ నెమలికి! అలా ఊరు చూద్దామనుకుని గురువారం ఆత్మకూరు మండలం సింగంపల్లిలో వాలింది. జాతీయ పక్షిని చూడగానే గ్రామస్తులు ఒక్కసారిగా సంబరపడిపోయారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసేందుకు ప్రయత్నిస్తుంటే... వెంటనే చెట్టుపై నుంచి ఇంటి ప్రహరీ పైకి వాలి ఫొటోలకు ఫోజులిచ్చింది. అతి సమీపంలోకి వచ్చిన చిన్నారులను చూసి ముచ్చటపడిందికాబోలు.... తాను అందరి నెచ్చెలినేనంటూ సరదాగా గెంతుతూ ఉత్సాహపరిచింది. ఈ దృశ్యాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. – ఆత్మకూరు:

యువకుడి బలవన్మరణం



వన్నూరుస్వామి మృతదేహం

బ్రహ్మసముద్రం : అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన వన్నూరుస్వామికి (28)కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న వన్నూరుస్వామి గత ఏడేళ్లుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. వైద్య చికిత్సకు, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.2 లక్షలకు పైగా చేరుకున్నాయి. అయినా జబ్బు నయం కాలేదు. ఈ క్రమంలో శరీరంలో శక్తి సన్నగిల్లడంతో ఏ పనీ చేసుకోలేని అసహాయ స్థితికి చేరుకున్నాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియని అయోమయ స్థితిలో జీవితంపై విరక్తి పెంచుకున్న వన్నూరుస్వామి... బుధవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.